డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడితే కేసులే

సీఐ నాగరాజు

బడంగ్‌పేట, డిసెంబర్ 30: నూతన సంవత్సర వేడుకలు సంతోషంగా జరుపుకోవాలని, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు పాల్పడిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని మీర్‌పేట సీఐ నాగరాజు హెచ్చరించారు. మద్యం తాగి వాహనాలు నడిపిన, డ్రంక్ అండ్ డ్రైవ్‌లో దొరికిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ఎవరు కూడా రోడ్ల పై కేక్‌లు కట్ చేయడం, వాహనాలు రోడ్ల పై పార్కింగ్ చేయడం నేరం అవుతుందన్నారు. ఇతరులకు ఇబ్బంది కల్గించే పనిచేయకూడదన్నారు. అన్ని కాలనీలలో బందోబస్తు ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. మంగళవారం అర్ధరాత్రి వరకు రెస్టారెంట్లు, హోటల్స్ ఉంటాయన్నారు. ఒంటి గంట తర్వాత మూసివేయాలన్నారు. ఉన్నతాధికారుల ఉత్తర్వుల మేరకు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా గట్టి బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామన్నారు.

అన్నదానం

చంపాపేట, డిసెంబర్ 30: అన్నార్థుల ఆకలి తీర్చేందుకు తాము చేపడుతున్న అన్నదాన కార్యక్రమానికి సహకరించేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని శ్రీ మాతా అన్నపూర్ణేశ్వరి అన్నప్రసాద వితరణ కమిటీ చైర్మన్ భగవాన్‌జీ అన్నారు. ప్రతి అమావాస్య సందర్భంగా కమిటీ ఆధ్వర్యంలో చంపాపేట నల్ల పోచమ్మ, ఎర్ర పోచమ్మ ఆలయ సమీపంలోని చౌకధరల దుకాణం ముందు 20 మాసాలుగా ప్రతి అమావాస్య రోజు చేపట్టే అన్నదాన కార్యక్రమం ఆనవాయితీలో భాగంగా సోమవారం సుమారు 500 మందికి అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో కమిటీ చైర్మన్ భగవాన్‌జీ, బీఆర్ఎస్ ఎల్బీనగర్ యూత్ అధ్యక్షుడు రవిముదిరాజ్, సుశీల్‌కుమార్, సంతోష్‌లడ్డ, ప్రవీణ్, ఘనసాల వెంకటేశ్, ఆడెళ్ల రాజా, అండేకార్ వెంకటేశ్ పాల్గొన్నారు.

మహంకాళి ఆలయంలో..

ఎల్బీనగర్, డిసెంబర్ 30: నాగోలులోని శ్రీ మహంకాళి దేవాలయంలో అమావాస్య సందర్భంగా అన్న ప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించారు. ప్రతి నెలా అమావాస్య సందర్భంగా ఆలయ ప్రాంగణంలో అన్నప్రసాదాన్ని పంపిణీ చేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై మహంకాళి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం అన్న ప్రసాదాన్ని స్వీకరించారు.

'ఆశ'లను ఆగం చేసిన కాంగ్రెస్

- నమ్మి ఓట్లేస్తే నట్టేట ముంచారు..
- పోలీసులతో కొట్టించిన ఘనత కాంగ్రెస్‌దే
- రూ. 18 వేలు ఫిక్స్‌డ్ వేతనం ఇవ్వాలని డిమాండ్
- తుక్కుగూడలో బస్‌జాతకు ఘన స్వాగతం
- కాంగ్రెస్ పార్టీకి వ్యతిరేకంగా నినాదాలు

తుక్కుగూడలో ఆశవర్కర్స్ యూనియన్ బస్‌జాతకు బతుకమ్మలతో స్వాగతం పలుకుతున్న ఆశవర్కర్లు

బడంగ్‌పేట,డిసెంబర్30: కాంగ్రెస్ ప్రభుత్వం ఆశ వర్కర్ల సమస్యలను విస్మరించిందని ఆశవర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు విజయలక్ష్మి, ప్రధాన కార్యదర్శి నీలా దేవి ఆరోపించారు. తెలంగాణ ఆశ వర్కర్స్ యూనియర్(సీఐటీయూ) ఆధ్వర్యంలో డిసెంబర్ 15 నుంచి 31వరకు తల పెట్టిన బస్సుజాత సోమవారం మహేశ్వరం నియోజక వర్గంలోని తుక్కుగూడకు చేరుకుంది. ఆశవర్కర్స్ యూనియన్ రాష్ట్ర సహాయ కార్యదర్శి సునీత, కోశాధికారి గంగామణి, ఉపాధ్యక్షురాలు సాధన, సహాయ కార్యదర్శి పద్మ, బాలమణితోఅధ్యక్షురాలు విజయలక్ష్మి, నీలాదేవి బస్ జాతతో తుక్కుగూడకు చేరుకోవడంతో ఆశవర్కర్ల జిల్లా అధ్యక్షురాలు కవిత ఆధ్వర్యంలో పెద్ద సంఖ్యలో తరలి వచ్చి బతుకమ్మలతో ఘన స్వాగతం పలికారు. శాలువాలతో వారిని సత్కరించారు. ఆశవర్కర్లు రోడ్డుపై బతుకమ్మ ఆడారు. కాంగ్రెస్ పార్టీకి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే మెరుగైన సౌకర్యాలు కల్పిస్తామని చెబితే నమ్మి ఓట్లేసి గెలిపిస్తే ఆశలను ఆగం చేశారన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి సంవత్సరం గడుస్తున్నా ఆశవర్కర్ల సమస్యలను మాత్రం పట్టించుకోవడం లేదని వారు విమర్శించారు. ఆశలకు వేతనాలు పెంచడంతో పాటు ఉద్యోగ భద్రత కల్పిస్తామని కాంగ్రెస్ ఎన్నికల మేనిఫెస్టోలో పెట్టిందని వారు గుర్తు చేశారు. ఆశల ఓట్లతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పోలీసులతో కొట్టిస్తున్నారని మండిపడ్డారు. న్యాయమైన సమస్యలను పరిష్కరించమంటే దాడులు చేయిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఆశలకు రూ.18 వేలు ఫిక్స్ వేతనం ఇస్తామని హామీ ఇచ్చారని గుర్తుచేశారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత మంత్రులకు, ఎమ్మెల్యేలకు అనేక సార్లు వినతి పత్రాలు ఇచ్చామని తెలిపారు. నిరసనలు పోరాటాలు చేస్తున్నా ప్రభుత్వానికి మాత్రం చీమ కుట్టినట్లు కూడా లేదన్నారు. సమస్యలను పరిష్కరించాలని కోరుతూ 31 వరకు బస్ జాత నిర్వహిస్తున్నామన్నారు. ఎన్‌హెచ్ఎం స్కీంలో భాగంగా 19 సంవత్సరాల నుంచి రాష్ట్రంలో ఆశవర్కర్లు పనిచేస్తున్నారని వారు గుర్తు చేశారు. అంతా బడుగు బలహీన వర్గాలకు చెందిన వారే అన్నారు. సమయ పాలన లేకుండా ఆరోగ్య సేవలు అందిస్తున్నామన్నారు. రాత్రి వరకు పనిచేయక పోతే వేతనాలు తగ్గించి ఇస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఆశలకు కనీస సౌకర్యాలు కల్పించడం లేదన్నారు. టార్గెట్లు పెట్టి ప్రభుత్వం వేధిస్తున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. డెలివరీల సందర్భంగా రెండు మూడు రోజులు కుటుంబాలను వదిలి ఉండవలసి వస్తుందన్నారు. టీబీ స్పూటమ్ డబ్బాలను ఆశలతో మోపిస్తున్నారన్నారు. ఎంత చాకిరి చేసిన ఆశల పై ప్రభుత్వం సవతి తల్లి ప్రేమ చూపుతుందన్నారు. ప్రభుత్వం ఏ పనికైనా ఆశవర్కర్లకు అప్పగిస్తున్నారని వారు అన్నారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం ఆశల సమస్యలను విస్మరించిందన్నారు. ఎన్నికలు వచ్చిన్నప్పుడు మాత్రమే ఆశలు గుర్తుకు వస్తారన్నారు. సమస్యలు పరిష్కరించేంత వరకు ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఆశ వర్కర్స్ యూనియర్(సీఐటీయూ) జిల్లా అధ్యక్షుడు పెంటయ్య, బాల్ రాజు, శేఖర్ యాదవ్, నీలవతి, భాగ్యలక్ష్మి, సుజాత తదితరులు పాల్గొన్నారు.

తుక్కగూడలో బతుకమ్మ ఆడుతూ కాంగ్రెస్ పార్టీకి వ్యతిరేకంగా పాటలు పాడుతున్న ఆశవర్కర్లు

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

ఆర్కేపురం, డిసెంబర్ 30 : న్యూ నాగోల్, సమతపురి కాలనీ, భవ్య హాస్పిటల్, మమతనగర్, వెంకటరమణ కాలనీ, ఆదర్శనగర్, పెద్దఅంబర్‌పేట్ ఇండ్రస్టీయల్, పెద్దఅంబర్‌పేట్ టౌన్, కోహెడ, పసుమాముల, తట్టిఅన్నారం, కుంట్లూరు, గౌరెల్లీ, లక్ష్మారెడ్డిపాలెం, శివగంగ కాలనీ, హరిపురి కాలనీ, రాఘవేంద్ర కాలనీ, కల్పంచ, శారదనగర్, లెక్చరర్స్ కాలనీ, మదర్‌డెయిరీ, గ్రీన్‌హిల్స్ కాలనీ, ఖిల్లామైసమ్మ, హనుమాన్‌నగర్, దుర్గానగర్ 11కేవీ ఫీడర్ పరిధిలో విద్యుత్ మరమ్మతుల కారణంగా మంగళవారం ఈ దిగువ తెలిపిన ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనున్నట్లు సరూర్‌నగర్ విద్యుత్‌శాఖ డీఈ కె.కె.రామకృష్ణ తెలిపారు.

బీసీ విద్యార్థి సంఘం ప్రధాన కార్యదర్శిగా సందీప్ కుమార్

ఆర్కేపురం, డిసెంబర్ 30 : బీసీ విద్యార్థి సంఘం ఎల్బీనగర్ నియోజకవర్గం ప్రధాన కార్యదర్శిగా చింతల సందీప్ కుమార్ నియమితులయ్యారు. బీసీ విద్యార్థి సంఘం ఎల్బీనగర్ నియోజకవర్గం సమావేశంలో బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గొడుగు మహేశ్ యాదవ్ చింతల సందీప్ కుమార్‌కు నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో విద్యార్థుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. తనను నియమించిన బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మహేశ్ యాదవ్‌కు, సహకరించిన బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు చింతకింది స్వామి కుమార్‌గౌడ్, ఆర్గనైజింగ్ సెక్రటరీ పాలకూరి కిరణ్‌గౌడ్, గొప్పుల చందు, బండిగారి భరత్, అనంతసాయి పవన్‌లకు కృతజ్ఞతలు తెలిపారు.

అక్రమంగా తరలిస్తున్న బియ్యం పట్టివేత

నిందితుడు జట్రోతు కుమార్

హయత్‌నగర్, డిసెంబర్ 30 : అక్రమంగా తరలిస్తున్న ఐదు క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని పోలీసులు పట్టుకున్నారు. నిందితుడి వద్ద వాహనం, రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఈ సంఘటన హయత్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో సోమవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... యాదాద్రి భువనగిరి జిల్లా, భువనగిరి మండలం, పచర్లబోడు తండాకు చెందిన జట్రోతు కుమార్, మహింద్రా జీటో కారు లో హయత్‌నగర్‌లోని పలు కాలనీల్లో, చుట్టుపక్కల గ్రామాల్లో పేదల వద్ద కిలో రేషన్ బియ్యాన్ని రూ.15 చొప్పున కొనుగోలు చేసి వనస్థలిపురంలో ఉండే నెహ్రూకు అధిక ధర కిలో రూ.19కు విక్రయిస్తుంటాడు. పక్కా సమాచారం మేరకు పోలీసులు సూర్యనగర్ కాలనీ కమాన్ ఎదుట విజయవాడ జాతీయ రహదారిపై వాహనాలు తనిఖీ చేస్తుండగా రేషన్ బియ్యం అక్రమంగా తరలిస్తున్న మహింద్రా మినీ వ్యానును పరిశీలించగా డ్రైవర్ కుమార్‌తోపాటు రేషన్ బియ్యం, వాహనాన్ని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

అమిత్‌షాను బర్తరఫ్ చేయాలి

నిరసన వ్యక్తం చేస్తున్న సీపీఎం నాయకులు

కాప్రా,డిసెంబర్ 30: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ పట్ల అవమానకరంగా, హేళనగా మాట్లాడిన కేంద్ర హోంమంత్రి అమిత్‌షాను వెంటనే పార్టీ పదవి నుంచి, కేంద్ర మంత్రి పదవినుంచి తొలగించాలని సీపీఎం కాప్రాసర్కిల్ కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు ఈసీఐఎల్ చౌరస్తాలో సీపీఎం ఆధ్వర్యంలో జరిగిన నిరసన, ధర్నా కార్యక్రమానికి సీపీఎం నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరై అమిత్‌షాకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు.ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జే.చంద్రశేఖర్, జీ.శ్రీనివాసులు మాట్లాడుతూ అంబేద్కర్ పట్ల కేంద్ర హోంమంత్రి కించపడరుస్తూ అవమానపర్చడం, అసభ్యకరంగా మాట్లాడటం క్షమించరానిదని అన్నారు. వెంటనే అమిత్‌షా పార్లమెంటు సాక్షిగా దేశప్రజలందరికీ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు శ్రీనివాస్, సర్కిల్ కమిటీ సభ్యులు కే.వెంకటాచారి, డికే దుర్గయ్య, శివన్నారాయణ, సోమయ్యాచారి, డీవీరావు, పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు రక్షణ చట్టం తీసుకురావాలి

మధ్యాహ్న భోజన సమయంలో నిరసన తెలుపుతున్న ఉపాధ్యాయులు

కందుకూరు, డిసెంబర్ 30 : ప్రభుత్వం ఉపాధ్యాయులకు రక్షణ చట్టం తీసుకురావాలని ఎస్ఎల్‌టీఏ జిల్లా అధ్యక్షుడు ఎండీ బషీర్ కోరారు. తుక్కుగూడ ప్రభుత్వ జిల్లా పరిషత్ పాఠశాల హెచ్ఎం రాములుపై జరిగిన దాడికి నిరసనగా మధ్యాహ్న భోజన సమయంలో నల్ల బ్యాడ్జీలను ధరించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎక్కడో ఓ చోట చిన్న చిన్న సంఘటనలకు మూకుమ్మడిగా ఉపాధ్యాయులపై దాడి చేయడం సమంజసం కాదని పేర్కొన్నారు.ఉపాధ్యాయులను అవమానించడం భావ్యం కాదని అన్నారు. ఉపాధ్యాయులపై దాడులు జరగకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. రాములుపై జరిగిన దాడిని ఖండిస్తున్నట్లు పేర్కొన్నారు. ఉపాధ్యాయులు అంటే గౌరవం లేకుండా పోతుందని వివరించారు. హెచ్ఎం శ్రీనివాస్ శర్మ, విజయమోహన్‌రెడ్డి, సురేశ్, క్రిష్ణ, గ్లోరీ, శాంతికుమారి, కౌసల్య పాల్గొన్నారు.

సరస్వతీనగర్ కాలనీ సంక్షేమ సంఘం నూతన కమిటీ

నూతన కమిటీ ప్రతినిధులు

సైదాబాద్, డిసెంబర్ 30 : సరస్వతీనగర్ కాలనీ సంక్షేమ సంఘం నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కాలనీలోని జిమ్ బిల్డింగ్ ఆవరణలో సోమవారం జరిగిన జనరల్ బాడీ మీటింగ్‌లో 2025-58 నూతన కమిటీని కాలనీవాసులు ఎన్నుకున్నారు. కాలనీ సంక్షేమ సంఘం నూతన అధ్యక్షుడిగా ప్రభాకర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా చెన్నారెడ్డి, కోశాధికారిగా భాస్కర్ రెడ్డి, ఉపాధ్యక్షులుగా నర్సింహారెడ్డి, సురేందర్ రెడ్డి, సహాయ కార్యదర్శులుగా మధుసూధన్ రావు, రమణారెడ్డి, కల్చరర్, స్పోర్ట్స్ సెక్రటరీగా వినోద్‌కుమార్, లీగల్ అడ్వైయిజర్‌గా రుషికేశ్ రెడ్డి, సలహాదారులుగా రామారావు, శ్రీపతి శ్రీనివాస్, కార్యవర్గ సభ్యులుగా గోవర్ధన్ రెడ్డి, రాజారాం రెడ్డి, బుస్సా శ్రీనివాస్ గుప్తా, రాఘవేంద్ర రెడ్డి, రాకేశ్ రావు, రమేశ్ కుమార్, సుధాకర్, వీరస్వామిలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ కాలనీలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తామని, కాలనీవాసులందరి సహాయ సహకాలతో కాలనీ అభివృద్ధి పథంలో నడిపించటమే లక్ష్యంగా పనిచేస్తామని తెలిపారు.

రైళ్లల్లో దొంగతనాలు

కాచిగూడ, డిసెంబర్ 30: స్పెషల్ రైల్లో ప్రయాణిరాలి వెండి ఆభరణాల ను గుర్తుతెలియని వ్యక్తులు దొంగిలించారు. కాచిగూడ రైల్వే ఇన్‌స్పెక్టర్ ఎల్లప్ప తెలిపిన వివరాల ప్రకారం..కరీంనగర్‌కు చెందిన రమాకుమారి కాచిగూడ స్పెషల్ రైల్లో కాచిగూడకు వస్తుండగా మార్గమధ్యలో పిడుగురాళ్ల రైల్వే స్టేషన్ మధ్య చూసుకునేసరికి బ్యాగులో 50 గ్రాముల వెండి ఆభరణాలు, రూ.2 వేలు, 2 ఫోన్లు కనిపించలేదు. సోమవారం రాత్రి కాచిగూడ రైల్వే పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకుని తదుపరి విచారణ నిమిత్తం నడికుడి రైల్వే పోలీస్‌స్టేషన్‌కు బదిలీ చేసినట్లు హెడ్‌కానిస్టేబుల్ బీజీ ప్రసాద్‌రావు తెలిపారు.

మరో ఘటనలో..

ఉత్తర సంపర్క్‌క్రాంతి రైల్లో ఆర్మీ ఉద్యోగి నగదు, లిక్కర్ కార్డును దొంగిలించారు. కాచిగూడ రైల్వే ఇన్‌స్పెక్టర్ ఎల్లప్ప తెలిపిన వివరాల ప్రకారం.. జమ్ముకాశ్మీర్‌కు చెందిన నాగేశ్వర్‌రావు ఆర్మీ ఉద్యోగి. జమ్ముకాశ్మీర్ రైల్వే స్టేషన్‌లో ఉత్తర సంపర్క్‌క్రాంతి రైలెక్కుతుండగా అతని పార్సులోంచి రూ.2500, లిక్కర్, ఆధార్, ఏటీఎం కార్డులు గుర్తుతెలియని వ్యక్తులు దొంగిలించారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

కొత్తపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 2002-03 సంవత్సరంలో పదో తరగతి చదువుకున్న విద్యార్థులు 21 సంవత్సరాల తర్వాత సోమవారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. పాఠశాల ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు కలుసుకుని తమ చిన్ననాటి మధుర స్మృతులను నెమరువేసుకున్నారు. -ఎల్బీనగర్, డిసెంబర్ 30

3 నుంచి అంతర్జాతీయ తెలుగు మహాసభలు

తెలుగు యూనివర్సిటీ, డిసెంబర్ 30 : ప్రపంచ తెలుగు సమాఖ్య ఆధ్వర్యంలో 12వ ద్వైవార్షిక అంతర్జాతీయ తెలుగు మహాసభలను జనవరి 3, 4, 5 తేదీల లో నగరంలోని నోవాటెల్ కన్వెన్షన్(హెచ్ఐసీసీ)లో నిర్వహిస్తున్నామని సమాఖ్య అధ్యక్షురాలు డాక్టర్ వి.ఎల్. ఇందిరాదత్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. తెలుగు భాషా సాహిత్యాలు, సంప్రదాయాలు, ఆధునిక కళలు భావితరాలకు అందించాలనే సదాశయంతో సమాఖ్య 30 ఏండ్లుగా ప్రపంచవ్యాప్తంగా తెలుగు ప్రజలను ఏకం చేస్తూ అనేక సభలు, సదస్సులు, సమావేశాలను నిర్వహిస్తున్నట్లు ఆమె వెల్లడించారు. ఈ కోవలోనే ప్రపంచంలోని పలు దేశాల తెలుగు ప్రజలను నగరం వేదికగా జరగనున్న అంతర్జాతీయ తెలుగు మహాసభలలో భాగస్వామ్యులను చేసే లక్ష్యంతో మూడురోజుల పాటు వేడుకలు నిర్వహిస్తున్నామన్నారు. సభలను ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ప్రారంభిస్తారని తెలిపారు. రెండోరోజు కేంద్రమంత్రి జి. కిషన్‌రెడ్డి, తెలంగాణ పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖమంత్రి దనసారి అనసూయ సీతక్క పాల్గొంటారని వెల్లడించారు. ముగింపు రోజున పూర్వ ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు, తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తదితరులు పాల్గొంటారని తెలిపారు. ప్రతిరోజూ సంగీత, సాహిత్య కార్యక్రమాల కళాప్రదర్శనలు ఉంటాయని, సాహితీవేత్తలను ఈ సందర్భంగా సన్మానించుకుంటున్నట్లు తెలిపారు.

నిత్యావసర సరుకులు పంపిణీ

సరుకులు పంపిణీ చేస్తున్న సహారా స్వచ్ఛంద సంస్థ సేవకులు

గోల్నాక : సహారా స్వచ్ఛంద సంస్థ 38వ వ్యవస్థాపక దినోత్సవాన్ని సోమవారం నిర్వహించారు. అంబర్‌పేట తిరుమలనగర్‌లోని సంస్థ ప్రధాన కార్యాలయంలో పేద విద్యార్థినులకు నిత్యావసర సరుకులను సంస్థ డైరెక్టర్ టీఎన్ బాలముకుంద్ అందజేసి, అన్నదానం చేశారు. స్వచ్ఛంద సేవకులు డాక్టర్ రాధికరోహిణి, రజిత, పద్మజ, పాండు, చంద్రలేఖ, రామ్మోహన్‌రావు, కరుణాసింగ్ హాజరై.. సంస్థ వ్యవస్థాపకులు దివంగత రామగిరి నర్సింగ్‌రావు 37 ఏండ్లుగా చేసిన సేవలను కొనియాడారు. సంస్థ ప్రతినిధులు, సిబ్బంది ప్రదీప్, డాక్టర్ ముఖేశ్, భాస్కర్, యశ్వంత్, వెంకటాద్రి, నవిత, సంహిత గాంధారి, రమ పాల్గొన్నారు.

ట్రస్మా రాష్ట్ర అధ్యక్షుడిగా మధుసూదన్

గోల్నాక : రాష్ట్ర గుర్తింపు పొందిన పాఠశాలల యాజమాన్యాల సంఘం (ట్రస్మా) అధ్యక్షుడిగా అంబర్‌పేట బాపునగర్ ప్రగతి విద్యానికేతన్ హైస్కూల్ చైర్మన్ సాధుల మధుసూదన్ గెలుపొందారు. సాధుల మధుసూదన్‌కు 2220 ఓట్లు పోలవగా, సమీప ప్రత్యర్థి ప్రకాశ్ బాబుకు 91 ఓట్లు పోలయ్యాయి. ప్రధాన కార్యదర్శిగా ఎన్. రమేశ్‌బాబు, కోశాధికారిగా పి.రాఘవేందర్ గెలుపొందారు. వీరికి ట్రస్మా ఎన్నికల రిటర్నింగ్ అధికారి నర్రా నారాయణరెడ్డి ఎన్నికల ధ్రువీకరణ పత్రాలు అందజేశారు.

6న సువాసిని పూజ

సువాసిని పూజకు సంబంధించిన కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న అనంత లక్ష్మి, మునిపల్లె సువర్ణలత

ఆర్కేపురం, డిసెంబర్ 30 : కుర్తాళ పీఠాధిపతులు జగద్గురు శ్రీ సిద్ధేశ్వరానంద భారతీ మహాస్వామి దివ్య సమక్షంలో శ్రీ శక్తి పీఠాధిశ్వరి మాతాజీ శ్రీ రమ్యానందభారతీ స్వామి వారి ఆధ్వర్యంలో 39వ జన్మదినం సందర్భంగా జనవరి 6న బీబీనగర్ మగ్దూంపల్లి భైరవపురిలో 2000 మంది మహిళలతో సువాసిని పూజ నిర్వహించనున్నట్లు ప్రముఖ ఆధ్మాత్మిక ప్రవచన కర్త అనంత లక్ష్మి తెలిపారు. సువాసిని పూజకు సంబంధించిన కరపత్రాన్ని సోమవారం ప్రత్యంగిరా దేవాలయంలో అనంత లక్ష్మి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పీఠాధిపతులు జగద్గురువులు శ్రీ స్వామివారి సమక్షంలో మాతాజీ గత కొన్ని సంవత్సరాలుగా ఉమ్మడి తెలుగు రాష్ట్రాలలో అనేక సువాసిన పూజలు నిర్వహించటం చాలా గొప్ప సేవ అని, సువాసిని పూజ నిత్య సుమంగళి యోగాన్ని, ఐశ్వర్యాన్ని, అభిష్టి సిద్ధిని ప్రసాదిస్తుందని తెలిపారు. లోక కల్యాణార్థం ప్రతి ఒక్కరికి అమ్మవారి అనుగ్రహం లభించడం కోసం విశేషించి హిందూ ధర్మ రక్షణలో మహత్తరమైన మహిళా శక్తి ఏకీకృతం చేయడం కోసం జరిగే ఈ సువాసిన పూజలో మహిళలు పాల్గొనాలని ఆమె పిలుపునిచ్చారు. మునిపల్లె సువర్ణలత మాట్లాడుతూ ఉదయం 9గంటలకు పూజ ప్రారంభమవుతుందని రిజిస్టర్ చేసుకున్న సువాసినులకు మాత్రమే పూజ జరుగుతుందని, పూజలో పాల్గొన్న వారికి అమ్మవారి ప్రసాదం, చీర, సారె, అన్నప్రసాద వితరణ జరుగుతుందని చెప్పారు. వివరాల కోసం 7997990023, 8858853690 కు సంప్రదించాలని కోరారు. సువర్ణలత, అరుణ, హేమ, రాజ్యలక్ష్మి, పద్మశ్రీదేవి, దివ్య, సంజన, ప్రశాంతి, మల్లిక తదితరులు ఉన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణపై అవగాహన

రోడ్డు ప్రమాదాల నివారణ కోసం రహదారి భద్రతపై వాహనదారులకు అవగాహన కల్పించాలని ఎల్బీనగర్ కామినేని దవాఖాన ఎమర్జెన్సీ విభాగం ఇన్‌చార్జి, డాక్టర్ వెంకటరమణ తెలిపారు. ఎల్బీనగర్ కామినేని దవాఖానలోని ఇందిరా ఆడిటోరియంలో సోమవారం విలేకరుల సమావేశాన్ని నిర్వహించి 2024వ సంవత్సరంలో ప్రమాదాల బారినపడి ఆస్పత్రిలో చికిత్స కోసం వచ్చిన వారికి అందించిన చికిత్సతో పాటు.. ప్రాణాపాయ స్థితిలో ఉన్న వారికి పునర్జన్మనిచ్చిన వివరాలను తెలియజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ నవీన్‌రెడ్డి మాట్లాడుతూ 2024వ సంవత్సరంలో ప్రమాదాల బారినపడి ఆస్పత్రికి వచ్చిన సుమారు 1500 నుంచి 1600 మందికి పైగా ప్రాణాలను ట్రామా కేసుల నుంచి కాపాడినట్లు తెలిపారు. ప్రమాదాల నుంచి రక్షణ పొందే విషయంపై కామినేని దవాఖాన ఆస్పత్రి ఆధ్వర్యంలో ఔట్‌రిచ్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఔట్‌రిచ్ కార్యక్రమం ద్వారా పాఠశాలలు, కళాశాల విద్యార్థులకు ప్రమాదాల నుంచి రక్షణ పొందేందుకు తీసుకోవల్సిన చర్యలపై అవగాహన కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. డాక్టర్ నవీన్‌రెడ్డి, డాక్టర్ శృంగల దేవిజన్ తదితరులు పాల్గొన్నారు. -మన్సూరాబాద్, డిసెంబర్ 30:

రోడ్డు ప్రమాద కేసులో వ్యక్తికి ఆరు నెలల జైలు

రంగారెడ్డి కోర్టులు,డిసెంబర్ 30: నిర్లక్ష్యంగా వాహనం నడిపి వ్యక్తి మృతికి కారణమైన మహ్మద్ అబ్దుల్ అజీజ్‌కి ఆరు నెలల జైలుశిక్ష విధిస్తూ రంగారెడ్డి మొదటి మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్ నర్మద తీర్పునిచ్చారు. అసిస్టెంట్ పీపీ కథనం ప్రకారం..జియాగూడ, ఇమాన్‌పూరకు చెందిన మదిర వంశీ కృష్ణ తన సమీప బంధువుతో కలిసి తన ద్విచక్ర వాహనంపై బాలాపూర్ నుంచి వెళుతుండగా 2021ఆగస్టు 12న వైఏ ఆర్ గార్డెన్ సమీపంలో రాగానే అజీజ్ తన పల్సర్ బైక్‌ను అతి వేగంగా, అజాగ్రత్తగా నడుపుతూ వంశీకృష్ణ వాహనాన్ని ఢీకొట్టాడు. వంశీకృష్ణ తీవ్రంగా గాయపడగా వెంటనే ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మరణించాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు నిర్వహించి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేయగా సాక్ష్యాధారాలను పరిశీలించిన న్యాయస్థానం శిరునెలలక్ష విధిస్తూ తీర్పునిచ్చింది.

బీఈ పరీక్ష ఫీజు స్వీకరణ గడువు పొడిగింపు

ఉస్మానియా యూనివర్సిటీ, డిసెంబర్ 30: ఓయూ పరిధిలోని అన్ని బీఈ కోర్సుల పరీక్షల ఫీజు స్వీకరణ గడువు పొడిగించినట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ శశికాంత్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. బీఈ (ఏఐసీటీఈ), బీఈ (సీబీసీఎస్), బీఈ (నాన్‌సీబీసీఎస్) కోర్సుల మెయిన్, బ్యాక్‌లాగ్, సప్లిమెంటరీ పరీక్ష ఫీజును వచ్చే నెల 3వ తేదీలోగా సంబంధిత కళాశాలల్లో చెల్లించాలన్నారు. ఈ పరీక్షలను వచ్చే నెలలో నిర్వహించనున్నట్లు తెలిపారు. పరీక్షా తేదీల పూర్తి వివరాలను త్వరలోనే ప్రకటిస్తామన్నార